సాక్షి
ఒడిశా

గురువారం । 26 । డిసెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,23,068లు, బంగారం 3 గ్రాముల 200 మిల్లీగ్రాములు వెండి 73 గ్రాముల 700 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



నేటి నుంచి చైతీ ఉత్సవాలు

రాయగడలో చైతీ ఉత్సవాలకు రంగం సిద్ధమైంది. గురువారం జరిగే ఈ వేడుకలకు ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి హాజరవుతున్న నేపథ్యంలో పక్కాగా ఏర్పాట్లు చేశారు.

- 8లో▸



ఘనంగా తులసీ పూజ

జయపురంలోని హనుమాన్ విహార్ లావణ్య కుటీరంలో బుధవారం తులసీ పూజా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

- 8లో▸

న్యూస్‌రీల్

గంజాయి సాగు ధ్వంసం



గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న సిబ్బంది

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ సమితి నువాగడ పంచాయతీ మహాదిమ్ ప్రాంతంలో గంజాయి వనాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. సుమారు 8 ఎకరాల విస్తీర్ణంలో సాగవుతున్న 24 వేల గంజాయి మొక్కలను ధ్వంసం చేసి వాటిని తగుల బెట్టారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేశారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ స్వాతి

రాయగడ: అప్పు తీర్చలేదన్న కోపంతో స్నేహితుడిని దారుణంగా హత్య చేసిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ స్వాతి ఎస్‌జకుమార్ మంగళవారం రాత్రి తన కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. టికిరి పంచాయతీ దొరాగుడ గ్రామానికి చెందిన(ఆర్‌ఆర్‌నగర్‌లో నివాసముంటున్నాడు) బలరాం, జిరిగాం గ్రామానికి చెందిన రమేష్ జొడియాలు స్నేహితులు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని రమేష్ వద్ద బలరాం రూ.25 వేల అప్పు తీసుకున్నాడు. తిరిగి తీర్చాలని ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోకపోవడంతో బలరాంను ఈ నెల 14న కాశీపూర్ సమితి జిరిగాంలో రమేష్ హత్య చేశాడు. బలరాం వద్ద పర్సును తీసుకున్న రమేష్ అందులో డెబిట్ కార్డును షాపింగ్, బ్యాంకు లావాదేవీలకు ప్రయత్నించాడు. బ్యాంకు సీసీ కెమెరాల ఆధారంగా రమేష్‌ను పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. విలేకర్ల సమావేశంలో ఏఎస్పీ బిష్ణుప్రసాద్ పాత్రో, ఎస్‌డీపీఓ రస్మీరంజన్ సేనాపతి పాల్గొన్నారు.

కుక్కల దాడిలో చిన్నారి మృతి



చాందిని హరిజన్(ఫైల్)

జయపురం : జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ సమితి పుప్పుగాం గ్రామంలో వీధికుక్కల దాడిలో చాందినీ హరిజన్(6) అనే బాలిక మృతి చెందింది. బుధవారం ఉదయం బాలిక తన ఇంటి సమీపంలోని పొలం వద్ద పశువులు మేస్తుండగా అక్కడికి వెళ్లింది. ఒక్కసారిగా ఐదు కుక్కలు చుట్టుముట్టి దాడి చేశాయి. బాలిక కేకలు విని సోదరుడు పరుగుపరుగున వెళ్లి విషయం గ్రామస్తులకు చెప్పాడు. అప్పటికే తీవ్రంగా గాయపడిన బాలికను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కుములిపుట్ ప్రాథమిక చికిత్సాలయానికి తీసుకెళ్లారు. అప్పటికే బాలిక మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. చాందిని పుప్పుగాంలో తన తాత ఇంటి వద్ద ఉంటూ చదువుకుంటోంది. కుమార్తె ఇక లేదని తెలిసి తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు.

ఐదెకరాల్లో గంజాయి సాగు ధ్వంసం



గంజాయి మొక్కలను కాల్చివేస్తున్న పోలీసులు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి చింతలవాడ పంచాయతీ కర్కటపల్లి, పరజాగూడ గ్రామాల్లోని ఐదు ఏకరాల్లో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను కోరుకొండ సమితి పోలీసులు బుధవారం ధ్వంసం చేశారు. ఈ సాగును కొండలపై చేస్తున్నారు. కోరుకొండ పోలీసులకు ముందస్తు సమాచారం రావడంతో కలిమెల తహసీల్దార్ రామకృష్ణ సత్యరాజ్ ఆధ్వర్యంలో గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. గంజాయి పంట విలువ రూ.60 లక్షల ఉంటుందని పోలీసులు తెలిపారు.


రత్న భాండాగారం పనులు నిలిపివేత

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని రత్న భాండాగారం నిర్వహణ, మరమ్మతు పనులు తాత్కాలికంగా నిలిపివేసినట్లు అధికారవర్గాలు బుధవారం ప్రకటించాయి. ఈ నెల 17 నుంచి పనులు ప్రారంభమైన విషయం తెలిసిందే. క్రిస్మస్ సెలవులు, ఆంగ్ల సంవత్సరాది పురస్కరించుకుని శ్రీ మందిరానికి భక్తుల తాకిడి పెరుగుతుంది. ఈ నేపథ్యంలో రత్న భాండాగారం మరమ్మతు పనుల కారణంగా దర్శనానికి అంతరాయం కలగకుండా తాత్కాలికంగా వాయిదా వేసినట్లు అధికార వర్గాలు వివరించాయి. కొత్త సంవత్సరంలో జనవరి 2 వరకు శ్రీమందిరం రత్న భాండాగారం మరమ్మతులు నిలిపివేసినట్లు ప్రకటించారు. జనవరి 3 నుంచి పనులు యథాతథంగా కొనసాగిస్తామని తెలిపారు.

ఆనందాల క్రిస్మస్



జయపురం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న మహిళలు



జయపురం : దేదీప్యమానంగా వెలుగుతున్న జేఈఎల్‌సీ చర్చి

- చర్చిల వద్ద అంబరాన్నంటిన సంబరాలు
- నృత్యాలతో సందడి చేసిన యువత
- క్రీస్తు సందేశం వినిపించిన పాస్టర్లు

జయపురం: క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. అవిభక్త కొరాపుట్‌లో అన్ని ప్రాంతాల్లోనూ చర్చిలు భక్తజనంతో పోటెత్తాయి. 143 ఏళ్ల చరిత్ర గలిగిన జయపురం జేఈఎల్‌సీ చర్చిలో వేలాది మంది ఆరాధకులు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి వేడుకలకు హాజరై ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవులతో పాటు ఇతర మతస్తులు పండగలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. బొరిగుమ్మ, కొట్‌పాడ్, బొరిగుమ్మ, కుంధ్ర, బొయిపరిగుడ తదితర ప్రాంతాల్లో క్రిస్మస్ పండగను ఘనంగా జరుపుకొన్నారు.

రాయగడలో..

క్రిస్మస్ వేడుకలు రాయగడ పట్టణంలో ఘనంగా జరిగాయి. స్థానిక అంబేడ్కర్‌నగర్‌లో మేరీ మాతను ప్రత్యేకంగా అలంకరించి ప్రార్థనలు నిర్వహించారు. కోయిర్ బృందం నృత్యాలు, ఆధ్యాత్మిక గీతాలపనలు, క్రైస్తవారాధనలు జరిగాయి. కార్యక్రమంలో చర్చి సంఘం సభ్యులు, అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం ఉదయం నుంచి వర్షం పడుతున్నా పట్టణంలోని కళాశాల రోడ్డులోని సెంటినరీ బాప్టిస్టు చర్చికి అనేక మంది క్రిస్టియన్లు విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి పాదర్ డాక్టర్ ప్రదీప్‌కుమార్ యేసు సువార్తను చదివి వినిపించారు. క్రీస్తు జన్మించిన పశువుల పాకను ఆర్‌సీఎం చర్చిలో అందంగా అలంకరించారు. అలాగే డోలా ట్యాంకు రోడ్డులోని ఆర్‌సీఎం చర్చిలో పాదర్ అజిత్ కుమార్ నాయక్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దండుమాలవీధి వద్ద ఒడియా బాప్టిస్టు చర్చిలో యేసుప్రభువు పాటలు పాడి ప్రసంగాలు చేశారు. జిల్లాలో మోహానా, ఆర్.ఉదయగిరి, నువాగడ, కాశీనగర్‌లో శియ్యాలి, ఖండవ, గుమ్మాలో కోలాకోట్, అజయగడ, సెరంగో గ్రామాలలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.



రాయగడ: మేరీమాత విగ్రహం



పర్లాకిమిడి: ఏసుక్రీస్తు క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం



జయపురం: చర్చి వద్ద క్రైస్తవుల సందడి



రాయగడ: ఏసు జన్మవృత్తాంతం తెలిపే ప్రదర్శన



పర్లాకిమిడి: సెంటినరీ బాప్టిస్టు చర్చిలో క్రీస్తు సందేశాన్ని వినిపిస్తున్న డాక్టర్ ప్రదీప్ కుమార్



బొరిగుమ్మ చర్చి వద్ద జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి తదితరులు



పర్లాకిమిడి: ఆర్‌సీఎం చర్చిలో క్రీస్తు జననంపై చిత్రాలు



పర్లాకిమిడి: సెంటినరీ బాప్టిస్టు చర్చిలో ప్రార్థనలు



పర్లాకిమిడి: గుమ్మ సమితిలోని పి.కాలనీ చర్చిలో ప్రార్థనలు పాల్గొన్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

భారీ వర్షాలు

భువనేశ్వర్: రాష్ట్రంలో అత్యధిక జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తుంది. ఇదే పరిస్థితి మరో రెండు రోజులపాటు కొనసాగుతుందని స్థానిక వాతావరణ కేంద్రం ప్రకటించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. బుధవారం ఖుర్దా, కలహండి జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదు అయింది.

దట్టంగా మంచు

రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో మంచు దట్టంగా కమ్ముతుందని వాతావరణ కేంద్రం ముందస్తు సమాచారం జారీ చేసింది. నవరంగపూర్, కలహండి, కంధమల్, రాయగడ, గజపతి, గంజాం జిల్లాల్లో ఈ నెల 27వ తేదీ వరకు ఒకటి, రెండు చోట్ల తేలికపాటి వర్షం కురుస్తుంది.సోన్‌పూర్, బౌధ్, సువాపడా, బొలంగీరు, కలహండి, కంధమల్, నవరంగపూర్, రాయగడ, కొరాపుట్, మల్కన్‌గిరి జిల్లాల్లో కొన్ని చోట్ల మంచు దట్టంగా కమ్ముతుంది.

వదలని వాన



పర్లాకిమిడి: గజపతి జిల్లా పర్లాకిమిడి, రాయగడలో ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. మోహనా నియోజకవర్గంలో కుండపోతగా వాన పడటంతో క్రిస్మస్ వేడుకలకు అంతరాయం కలిగింది. చర్చిలు ఎక్కువగా ఉన్న మోహనా, అడవ, రాయిపంక, దమ్మదువా ప్రాంతాల్లో సుమారు 25.0 మి.మీ.వర్షం కురిసిందని అధికారులు తెలిపారు.

ధాన్యం కొనుగోలు మండీలపై నిఘా!



సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం

- కంట్రోల్ రూం ఏర్పాటు
- నిరంతరం పర్యవేక్షిస్తున్న అధికారులు

జయపురం: ఖరీఫ్ సీజన్‌లో పండిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేసిన మండీల్లో జరిగే కార్యక్రమాలపై అధికారులు ప్రత్యేక నిఘా వేశారు. జయపురం సబ్‌కలెక్టర్ ఎ.శౌర్యారెడ్డి తన కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. అచ్చట ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. మండీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని మోనిటర్‌తో సబ్‌కలెక్టర్ కార్యాలయ కంట్రోల్ రూంకు అనుసంధానం చేశారు. మండీలలో ఎటువంటి సమస్య ఎదురైన రైతులు అక్కడ నుంచే కంట్రోలు రూంకు తెలియజేయవచ్చు. కంట్రోల్ రూంలో విధుల్లో ఉండే ఉద్యోగి మండీలలో జరుతున్న పరిస్థితులను నేరుగా తెలుసుకునేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. మండీలలో జరుగుతున్న కార్యకలాపాలు, రైతుల సమస్యలను తెలుసుకొనేందుకు ఈ ఏర్పాట్లు చేసినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. కంట్రోల్ రూములో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసి..ప్రత్యేకంగా 06854-230300 నంబర్‌ను కేటాయించారు. మండీలలో సమస్యలను రైతులు ఈ నంబర్‌కు నేరుగా తెలియజేయవచ్చు. రైతుల అభియోగాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రిజస్టర్‌లో హెల్ప్‌లైన్ ఉద్యోగి నమోదు చేస్తారు. వాటిని అధికారులు పరిశీలించి తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారు. జయపురం సబ్‌డివిజన్‌లో 73 స్థానాలలో ధాన్యం కొనుకోలు మండీలు ఏర్పాటు చేసి వాటిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం మోనిటర్‌తో అనుసంధానం చేసినట్టు అధికార వర్గాలు వెల్లడించారు. మండీలు ప్రారంభించిన రోజునే వాటిని కంట్రోల్ రూంతో కనెక్టు చేస్తారు. అలాగే ధాన్యం ఇతర రాష్ట్రాలకు తరలిపోకుండా బొయిపరిగుడ సమితి టంగిని గుడ, కొట్‌పాడ్ సమితిలో చందిలి రహదారులలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. వీటిని కూడా కంట్రోల్ రూంకు అనుసంధానం చేస్తామన్నారు.

ఆదర్శ గ్రామంలో కలెక్టర్ పర్యటన

రాయగడ:

రాయగడ జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి మునిగుడ సమితి పరిధిలోని శకట ఆదర్శ గ్రామంలో బుధవారం పర్యటించారు. బిర్సాముండ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 15 వ తేదీన ఈ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ శకట గ్రామాన్ని సందర్శించి అక్కడ గల సమస్యలను పరిశీలించారు. గ్రామస్తుల సమస్యలను విన్నారు. అంగన్‌వాడీ, పాఠశాల పరిస్థితులపై ఆరా తీశారు. పుట్టగొడుగులు పంట కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామాభివృద్ధి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు. త్వరలోనే గ్రామానికి అవసరమైన మౌలిక సౌకర్యాలను మెరుగు పరిచేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.



శకట గ్రామంలో పర్యావరణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఫరూల్ పట్వారి

ఎందుకో.. ఏమో..!

- అనూహ్యంగా గవర్నరు రఘుబర దాస్ రాజీనామా
- రాజకీయవర్గాల్లో వాడీవేడి చర్చ

భువనేశ్వర్: రాష్ట్ర గవర్నర్‌గా రఘుబర దాస్ తన పదవికి రాజీనామా చేయడం రాజకీయవర్గాల్లో వాడీవేడి చర్చకు దారితీసింది. రఘుబర దాస్ రాజీనామా, కొత్త గవర్నరు నియామకం పట్ల ఏమాత్రం విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తపడటం సర్వత్రా చర్చనీయాంశమైంది. రఘుబరదాస్ రాజీనామాకు ప్రేరేపించిన పరిస్థితుల పట్ల జోరుగా చర్చ సాగుతోంది. గత ఏడాది అక్టోబర్ 18న రాష్ట్ర గవర్నర్‌గా రఘుబర్‌దాస్ నియమితులయ్యారు. ఈ ఏడాది జరిగిన పూరీ జగన్నాథుని రథ యాత్ర సమయంలో ఆయన కుమారుడి నిర్వాకంతో వివాదంలో చిక్కుకున్నారు. గవర్నరు వ్యక్తిగత రక్షకుడిపై అమానుష దాడి తీవ్ర సంచలనం రేపింది. ఈ ఘటనపై ప్రభుత్వం ఇంత వరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. నెల రోజుల్లో విచారణ నివేదిక అందడంతో పదవులు, హోదాలు, పార్టీలకు అతీతంగా బాధ్యులైన వారి వ్యతిరేకంగా చట్టపరమైన చర్యలు చేపడతామని ప్రభుత్వం ప్రకటించింది. పూరీ జిల్లా కలెక్టరుని విచారణ అధికారిగా నియమించింది. ఈ విచారణ ఎక్కడి గొంగలి అక్కడే అన్న మాదిరి మరుగున పడింది. ఇంత వరకు విచారణ వివరాలు వెల్లడి కాలేదు. ఇంతలో గవర్నరు పదవికి రాజీనామా చేయడం, కొత్త గవర్నరు నియామకం జరగడం రాజకీయ శిబిరాల్లో కలకలం రేపింది.

మనస్పర్థలే కారణమా?

జార్ఖండ్‌లో భారతీయ జనతా పార్టీ ఓటమికి రఘుబర్‌దాస్ వర్గ స్పర్థలు కారణమనే ఆరోపణలు రాజకీయ శిబిరాల్లో దుమారం రేపుతున్నాయి. స్థానిక రాజ్ భవన్ కేంద్రంగా సొంత రాష్ట్రం రాజకీయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఈ నేపథ్యంలో ఆయన రాజీనామాను భారత రాష్ట్రపతి ఆమోదించడం, కొత్త గవర్నర్ నియామకం కూడా పూర్తి కావడం వెనక భారీ వ్యూహం ఉందని రాష్ట్రంలో రాజకీయ పక్షాల్లో చర్చ ఊపందుకుంటోంది.

అధిష్టానం నిర్ణయం మేరకే ...

గవర్నరు రఘుబర దాస్ రాజీనామా భారతీయ జనతా పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు జరిగి ఉంటుందని రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ అభిప్రాయపడ్డారు. కేంద్ర కమిటీ ఈ విషయమై కూలంకషంగా చర్చించిన మేరకు రాజీనామా ఖరారై ఉంటుందన్నారు.

సొంత నిర్ణయం..

రఘుబర దాస్ గవర్నరు పదవికి రాజీనామా చేయడం ఆయన సొంత నిర్ణయని, ఈ విషయమై ఎటువంటి చర్చ జరగలేదని బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి విజయపాల్ సింగ్ తోమర్ తెలిపారు. పార్టీ కేంద్ర కమిటీ నిర్ణయం మేరకు తదుపరి కార్యాచరణ కొనసాగుతుందని స్పష్టం చేశారు.



రఘుబర దాస్

విధేయతతో కొనసాగుతా..

భారతీయ జనతా పార్టీ పట్ల విధేయతతో కొనసాగుతానని రాష్ట్ర గవర్నర్ పదవికి రాజీనామా చేసిన రఘుబర్ దాస్ తెలిపారు. ఒడిశా ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం తన అదృష్టంగా పేర్కొన్నారు. తన పట్ల ఒడిశా ప్రజల ప్రోత్సాహం అభినందనీయమని కొనియాడారు. 2036 నాటికి ఒడిశా అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఆవిర్భవిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజీనామా తదనంతర కార్యాచరణ నేపథ్యంలో మాట్లాడుతూ తన భవిష్యత్ పాత్ర ఏమిటో పార్టీ నిర్ణయిస్తుందన్నారు. 1980 నుంచి పార్టీ సభ్యునిగా పనిచేస్తున్నానని, పార్టీ అధిష్టానం కేటాయించిన బాధ్యతల్ని చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

జగన్నాథున్ని దర్శించుకున్న రఘుబర దాస్



స్వామివారి సన్నిధిలో రఘుబరదాస్, కుటుంబ సభ్యులు

భువనేశ్వర్: రాష్ట్ర మాజీ గవర్నర్ రఘుబర దాస్ సకుటుంబ సమేతంగా పూరీ సందర్శించి జగన్నాథస్వామిని బుధవారం దర్శించుకున్నారు. ఆయన తన పదవికి రాజీనామా చేసిన తర్వాత శ్రీ మందిరం సందర్శన ప్రాధాన్యత సంతరించుకుంది.

వైభవంగా కాలభైరవ నిమజ్జనోత్సవం



కాలభైరవ విగ్రహ ఊరేగింపు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలోని బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో బుధవారం కాలభైరవ నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న కాలభైరవ నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. అనంతరం కాలభైరవ దీక్షాపరులు స్వామివారి విగ్రహాన్ని మేళతాళాలతో ఊరేగింపుగా నాగావళి నదికి తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఏరులై పారిన మద్యం!

- హైవేలో లారీ నుంచి జారిపడిన వైన్ బాక్సులు
- బాటిళ్ల కోసం ఎగబడిన స్థానికులు



జారిపడి మద్యం బాటిళ్ల బాక్సులను సరిచేస్తున్న సిబ్బంది



రోడ్డుపై పగిలిన మద్యం బాటిళ్లు

కాశీబుగ్గ : పలాస మండలం పారసాంబ గ్రామం వద్ద జాతీయ రహదారిపై మద్యం ఏరులై పారింది. శ్రీకాకుళం వైపు నుంచి పలాస వస్తున్న వాహనం నుంచి పారసాంబ వద్ద వైన్ బాటిళ్లు జారిపడ్డాయి. కొన్ని సీసాలు పగిలిపోవడంతో రోడ్డుపైనే మద్యం పారింది. విషయం తెలుసుకున్న పరిసర ప్రాంత ప్రజలు, మందుబాబులు బాటిళ్ల కోసం ఎగబడ్డారు. అనంతరం నేషనల్ హైవే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. రోడ్డుపై ఉన్న గాజు పెంకులను తొలగించారు. కాశీబుగ్గ పోలీసులు ఘటనపై కేసు నమోదు చేశారు.

27న రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ : శ్రీకాకుళం టౌన్‌హాల్ వేదికగా ఈ నెల 27న జిల్లా స్థాయి ఫెన్సింగ్ క్యాడెట్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని రాజా బుధవారం తెలిపారు. అండర్-17 విభాగంలో జరిగే ఈ ఎంపికలకు బాలబాలికలు ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5గంటలలోగా పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ నెల 27న ఉదయం 8 గంటలకు టౌన్ హాల్ వద్దకు ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జారీ చేసిన ఐడీ కార్డు జిరాక్స్, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం , వ్యక్తిగత ఫెన్సింగ్ మెటీరియల్‌తో హాజరుకావాలని కోరారు. 2008 జనవరి 1 నుంచి 2011 డిసెంబర్ 21 మధ్య జన్మించిన వారే అర్హులని పేర్కొన్నారు. ఇక్కడ ఎంపికైన వారిని ఈ నెల 28, 29వ తేదీలలో కాకినాడలో జరిగే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్యాడెట్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ 2024–25 పోటీలకు పంపిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఫెన్సింగ్ కోచ్ జోగిపాటి వంశీ(7660874844)ని సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి చైతీ ఉత్సవాలు

- హాజరుకానున్న సీఎం మోహన్‌చరణ్ మాఝి
- ఎడతెరిపి లేని వర్షాలతో చిత్తడిగా మారిన ప్రాంగణం

రాయగడ: చైతీ ఉత్సవాలకు రంగం సిద్ధమైంది. గురువారం జరిగే ఈ వేడుకలకు ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి హాజరవుతున్న నేపథ్యంలో నిర్వాహకులు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినప్పటికీ వరుణుడు ఆటంకం కలిగిస్తున్నాడు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఇప్పటికే ఉత్సవాల వేదిక తడిసి ముద్దయ్యింది. ప్రతీ ఏడాదిలా ఈసారి కూడా చైతీ ఉత్సవాలకు గోవింద చంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానం సిద్ధం చేశారు. ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నప్పటికీ వర్షం కారణంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ నీటితో నిండిపోయాయి. పరిసర ప్రాంతాలు బురదమయమయ్యాయి. సుమారు 376 స్టాల్స్ వద్ద ఇంకా వర్షపు నీరు నిలిచే ఉంది.

ప్రత్యేక ఆకర్షణగా వేదిక..

ఈ ఏడాది ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక అందరినీ ఆకట్టుకుంటోంది. ఆదివాసీల సంస్కృతికి ప్రతిబింబంగా రూపొందించారు. ఉత్సవాలను ప్రారంభించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝితో పాటు పంచాయతీ శాఖ మంత్రి రవినారాయణ నాయక్, కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక, ఎమ్మెల్యేలు అప్పలస్వామి కద్రక, నీలమాధవ హికక, సత్యజీత్ గొమాంగోలు హాజరు కానున్నారు. వేడుకల్లో భాగంగా గురువారం ఉదయం 9 గంటలకు స్థానిక మజ్జిగౌరి మందిరం నుంచి కలశ యాత్ర ప్రారంభం కానుంది. భారీ ఎత్తున ప్రజలు తరలివస్తారని అంచనా వేసిన జిల్లా యంత్రాంగం అందుకు అనుగుణంగా సన్నహాలు చేస్తోంది. ముఖ్యమంత్రి పర్యటన దాదాపు ఖరారైనప్పటికీ వాతావరణం అనుకూలించకపోతే పర్యటన రద్దయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.



సిద్ధమవుతున్న వేదిక





బురదమయంగా మారిన మైదానం


సేవకు సత్కారం



సత్యనారాయణను సత్కరిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: పర్లాకిమిడి పట్టణంలో కళింగ వైశ్య సంఘానికి చెందిన కుటుంబ సభ్యులు ఎవరైనా మరణిస్తే ఆ సమాచారాన్ని వేకువజామునే కులం వారి ఇంటింటికీ వెళ్లి చేరవేసే వార్తాహరుడుగా పి.సత్యనారాయణకు పేరు ఉంది. సుమారు 35 ఏళ్లుగా వేలాది మందికి సేవలు చేస్తూ వస్తున్న ఈయనను ఎవ్వరూ ఇంతవరకూ పెద్దగా గుర్తించలేదు. అయితే ఇటీవల మరణించిన బోయిన సంపత్ తల్లి 11వ రోజు కార్యక్రమాలు సందర్భంగా సత్యనారాయణ వారి కుటుంబానికి సేవలు అందించారు. ఆయన సేవలను గుర్తించిన బోయిన సతీష్, సంతోష్, సంపత్ సోదరులు స్థానిక దవలేశ్వర ఆలయంలో బుధవారం ఘనంగా సత్కరించారు.

జయపురంలో తులసీ పూజా దినోత్సవం



తులసీమాతకు పూజలు చేస్తున్న భక్తులు

జయపురం: స్థానిక హనుమాన్ విహార్‌లోని లావణ్య కుటీరంలో బుధవారం తులసీ పూజా దినోత్సవాన్ని నిర్వహించారు. వనవాసీ కళ్యాణాశ్రమం పట్టణ కార్యదర్శి లక్ష్మీకాంత మిశ్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హనుమాన్ విహార్‌లోని మహిళలు, పురుషులు తులసీ మాతకు పూజలు చేసి ఉత్సవం జరుపుకున్నారు. కార్యక్రమంలో కుందులి వైదిక గురుకులాశ్రమం పీఠాధిపతి ఆచార్య మనుదేవజీ ముఖ్యఅతిథిగా హాజరై తులసీ పౌరాణిక, వైజ్ఞానిక సంబంధిత విషయాలను వివరించారు. ఒక కుటుంబం ఒక తులసి మొక్కను పెంచితే పృధ్వి కలుషిత వాతావరణం నుంచి ముక్తి పొందవచ్చునని వివరించారు. విదేశాలలో ఉన్న సనాతనులు, హిందూ సంస్కృతి, సాంప్రదాయాలు పాటించేవారు ప్రతి ఏడాది డిసెంబర్ 25వ తేదీని తులసీ దినంగా పాటించి పూజలు జరుపుతారని వెల్లడించారు. కార్యక్రమంలో ఎల్.వి.రమణ, సింహాచల మహంతి, అశుతోష్ పండ, సబిత పాణిగ్రహి, కై లాస పుష్టి, అశ్విన్ కుమార్ రథ్, ఉత్కళ కుమార్ పండ, సుస్మిత రథ్, పుష్పలత రథ్ పాల్గొన్నారు.



భక్తులచే పూజలు చేయిస్తున్న ఆచార్య మనుదేవ్

కాంగ్రెస్‌లో బీజేడీ నాయకుల చేరిక

రాయగడ:

బీజేడీని వీడి కొందరు నాయకులు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక, సీనియర్ నాయకుడు దుర్గాప్రసాద్ పండా సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువాను కప్పుకున్నారు. సప్తగిరి ఉలక స్వగృహంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీలో చేరిన వారిలో మునిగుడ సమితి మునిఖోల్ పంచాయతీ సభ్యురాలు గెంబలి భాగ్యలక్ష్మీ, గుముటాగుడ పంచాయతీ సభ్యులు కున్ని కుమారి కద్రక, కుముడాబిల్లి పంచాయతీ సభ్యులు దద్భవ్ సికక, మునిగడు పంచాయతీ సభ్యులు శరత్ పిడికాలు ఉన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన పంచాయతీ సభ్యులు

మత్స్యకారులకు ఎన్‌ఎఫ్‌డీపీ కార్డుల పంపిణీ

వజ్రపుకొత్తూరు: మత్స్యకారులు ఎన్ఎఫ్‌డీపీ(నేషనల్ ఫిషరీస్ డిజిటల్ ప్లాట్‌ఫామ్) కార్డులను సద్వినియోగం చేసుకోవాలని మత్స్యశాఖ క్షేత్రాధికారి నాగరాజు కోరారు. బుధవారం పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని మత్స్యకారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున మత్స్యకారులు వేటకువెళ్లరాదని ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- మరో ఇద్దరికి గాయాలు



ఇజ్జాడ త్రినాథ(ఫైల్)

రణస్థలం: మండలంలోని నెలివాడ జాతీయ రహదారి ఫ్లై ఓవర్ కింద అండర్ పాస్ వద్ద సర్వీస్ రోడ్డులో ద్విచక్ర వాహనంతో వస్తున్న వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పిసిని గ్రామానికి చెందిన ఇజ్జాడ త్రినాథ(50), అతని భార్య ఇజ్జాడ చిన్నమ్మ, అతని మేనల్లుడు మీసాల ప్రకాష్‌లు ముగ్గురు ద్విచక్ర వాహనంపై రణస్థలం మండలంలోని గిరివానిపాలేం వెళ్లి, తిరిగి నెలివాడ మీదుగా స్వగ్రామం పిసిని గ్రామానికి వస్తున్నారు. ఈ సమయంలో శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వైపు సర్వీస్ రోడ్డులో వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా ఢీకొట్టింది. ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న మీసాల ప్రకాష్ చిన్న చిన్న గాయాలతో బయటపడ్డాడు. వెనుక కూర్చొన్న ఇజ్జాడ త్రినాథ, అతని భార్య ఇజ్జాడ చిన్నమ్మ అక్కడికక్కడే పడిపోయారు. అయితే త్రినాథ ప్రమాద స్థలంలోనే మృతి చెందగా, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెకు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. త్రినాథ వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నారు. ఇతనికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. దీంతో పిసిని గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నారు. జేఆర్‌పురం ఎస్ఐ చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



ప్రమాద స్థలంలో విలపిస్తున్న కుటుంబ సభ్యులు

ఘనంగా సుపరిపాలన దినోత్సవం

- మాజీ ప్రధాని వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న అధికారులు, నాయకులు

పర్లాకిమిడి: మాజీ ప్రధాని, భారత రత్న అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాన్ని సుపరిపాలన దినోత్సవంగా స్థానిక గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో బుధవారం అధికార యంత్రాంగం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ జితేంద్ర కుమార్ పండా, అతిథులుగా అదనపు జిల్లా మాజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్, డీఎఫ్ఓ ఎస్.ఆనంద్, సబ్ కలెక్టర్ అనుప్ పండా, సీనియర్ సిటిజన్ పూర్ణ చంద్ర మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. వాజ్‌పేయి హయాంలో చతుర్భుజ జాతీయ రహదారులు, నదుల అనుసంధానం, పీఎం సడక్ యోజనా పథకాలు దేశవ్యాప్తంగా అమలు చేశారని గుర్తుచేశారు. వాజ్‌పేయి హయంలో ప్రోఖాన్‌లో అణుబాంబు ప్రయోగాత్మకంగా పరీక్షించారన్నారు. వాజ్‌పాయి జయంతిని పురస్కరించుకుని సుపరిపాలన దినోత్సవం జరుపుకోవడం దేశానికి శుభసూచకమన్నారు. మహిళా కళాశాలలో నిర్వహించిన వక్తృత్వ, రచన పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ముఖ్యవక్తగా డి.పి.ఆర్.ఓ ప్రదిప్త గురుమయి మాట్లాడారు.

రాయగడలో..

రాయగడ: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి పురస్కరించుకుని స్థానిక అటానమస్ కళాశాలలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రముఖ రచయిత, కవి సుకాంత్ కుమార్ నాయక్, విద్యావేత్త డాక్టర్ డి.కె.మహంతి కళాశాల ప్రిన్సిపాల్ బబిలత షరప్, జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రదాన్‌లు గౌరవ అతిథులుగా హాజరయ్యారు. వాజ్‌పేయిని రాజకీయ జీవితం, నిస్వార్థపరమైన సేవలను గురించి వక్తలు కొనియాడారు.

కొరాపుట్: కొరాపుట్: మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి ఘనంగా జరిగింది. బుధవారం కొరాపుట్ జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సాంఘీక సంక్షేమ, విద్యాశాఖ మంత్రి నిత్యానంద గోండో మాట్లాడుతూ వాజ్‌పేయి సేవలు నేడు దేశానికి దిక్సూచిలా పని చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్, కొరాపుట్ ఎమ్మెల్యే రఘు రాం మచ్చో తదితరులు పాల్గొన్నారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని ఆర్.సి.డి హైస్కూల్‌లో జరిగిన అటల్ జయంతి వేడుకలలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో పాల్గొన్నారు.



రాయగడ: వాజ్‌పేయి జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న కలెక్టర్ పట్వారి, తదితరులు



రాయగడ: కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు



కొరాపుట్: బహుమతులు అందజేస్తున్న నబరంగ్‌పూర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో



కొరాపుట్: కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి నిత్యానంద గొండో, కలెక్టర్ కీర్తి వాసన్, ఎమ్మెల్యే రఘు రాం మచ్చో



పర్లాకిమిడి: వక్తృత్వ పోటీలో విజేతకు బహుమతుల ప్రదానం

ఉపాధ్యాయులకు జేఎల్ పదోన్నతులు కల్పించాలి

- ఆపస్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ

టెక్కలి: ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఇంటర్మీడియెట్ కళాశాలల్లో బోధించేందుకు జూనియర్ లెక్చరర్లగా పదోన్నతులు కల్పించాలని ఆపస్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ డిమాండ్ చేశారు. బుధవారం టెక్కలిలో జిల్లా అధ్యక్షుడు డి.శివరామ్‌ప్రసాద్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 శాతం నాన్‌టీచింగ్ సిబ్బందికి బీఎడ్ అర్హత లేకపోయినా ఎన్సీటీఈ ప్రకారం జేఎల్‌గా పదోన్నతులు ఇస్తుండగా.. బోధన అనుభవం కలిగిన ఉపాధ్యాయులకు జేఎల్‌గా ఎందుకు పదోన్నతులు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఉపాధ్యాయ పెన్షనర్లకు బకాయిలు విడుదల చేయాలని, హైస్కూల్ ప్లస్‌లను కొనసాగించి రెగ్యులర్ ప్రాతిపదికన పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా 12వ పీఆర్సీపై చర్యలు తీసుకోకపోవడం తగదన్నారు. సంక్రాంతికి 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆపస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో రాష్ట్ర గౌరవ సలహాదారుడు టి.ఆనందరావు, కార్యదర్శి డి.చలపతిరావు, సభ్యులు ఎస్.నరసింగరావు, కె.సోమేశ్వరరావు, సిహెచ్.రమణ, పి.కాశీవిశ్వనాథ్, గిరి, రవి, వాసు, చిన్ని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టెక్కలిలో చోరీ

టెక్కలి రూరల్: స్థానిక అయ్యప్పనగర్‌లో బుధవారం వేకువజామున నిర్మాణంలో ఉన్న ఒక ఇంట్లో చోరీ జరిగినట్లు ఇంటి యజమాని తెలిపారు. అయ్యప్పనగర్‌లో నూతనంగా జోగి హేమసుందర్ అనే వ్యక్తి ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. అయితే తన ఇంట్లోని ఒక గదిలో పనికి సంబంధించిన మిషన్లు, మరికొన్ని సామాన్లు భద్రపరిచారు. అయితే బుధవారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తి ఆ ఇంటి తాళాలు విరగొట్టి సామాగ్రి దొంగలించినట్లు ఆ ఇంటికి ఏర్పాటు చేసిన సీసీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. అనంతరం బాధితుడు టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మతోన్మాదుల నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకుందాం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

శ్రీకాకుళం(పీఎన్‌కాలనీ): దేశంలోని మతోన్మాదుల నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకుందామని వివిధ దళిత, ఆదివాసీ, ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. నగరంలోని అంబేడ్కర్ కూడలి వద్ద దళిత, ఆదివాసీ ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మనుస్మృతి దహనం కార్యక్రమం బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్లమెంట్ వేదికగా అంబేడ్కర్‌పై తీవ్రమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అయితే మనుస్మృతి తగలబెడుతుంటే పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం అంబేడ్కర్ విజ్ఞాన మందిరంలో సనాతన ధర్మం – భారత రాజ్యాంగం అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు క్లోపల్లి రాంగోపాల్, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్క కృష్ణయ్య, పౌర హక్కుల వేదిక నాయకుడు దానేశ్, మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేవీ జగన్నాథం, జన విజ్ఞాన వేదిక నాయకుడు గొంటి గిరిధర్, మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గణేష్, డీటీఎఫ్ కోత ధర్మారావు, కవి, సంపాదకుడు కృష్ణారావు, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బెలమర ప్రభాకర్, అంబేద్కర్ విజ్ఞాన మందిరం కమిటీ ప్రధాన కార్యదర్శి బడే కామరాజు, సమతా సైనిక్ దళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సల్ల రామారావు తదితరులు మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్రతో బీజేపీ ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. ప్రజలంతా ఈ విషయాన్ని గమనించి పాలకుల పోకడలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎడ్ల జానకిరావు, బొడ్డేపల్లి భుపతిరావు, వీజీకే మూర్తి, తంగి యరమ్మ, లింగాల అప్పన్న, కంఠ వేణు, కృష్ణవేణి బాలు, గన్నెప్పడు, బీవీ రమణ, చిన్నికృష్ణ, హరిప్రసాద్, రామప్పడు, శ్రీనివాసరావు, బీటీపీ నాయకులు చీర రమేష్, జగన్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్దాన కళాకారులకు సత్కారం

పలాస: సమాజంలో జరుగుతున్న సమస్యలపై ఉద్దానం రచయితలు స్పందించి జనాన్ని జాగృతం చేసే రచనలు చేయాలని ఉద్దానం రచయితల సంఘం(ఉరసం) అధ్యక్షుడు కుత్తుం వినోద్ పిలుపునిచ్చారు. పలాస మండలం మాకన్నపల్లి గ్రామంలో బుధవారం ఉరసం ఆవిర్భావ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్దానం ప్రాంతానికి చెందిన కళాకారులు, రచయితలు, కవులను ఘనంగా సన్మానించారు. బొడ్డపాడుకు జానపద కళాకారుడు గేదెల అప్పారావును కుత్తుం తాతారావు స్మారక పురస్కారం కింద రూ.5వేలు నగదు, జ్ఞాపిక , శాలువతో సత్కరించారు. అనంతరం నిశితాసి కవ్వం పుస్తకాన్ని ఆవిష్కరించి పరిచయం చేశారు. అందులోని పాటలను కుత్తుం వినోద్, వర్ధమాన గాయకుడు శాంతారావు, దానేసు, లత తదితరులు వినిపించారు. కార్యక్రమంలో జర్నలిస్టు పొట్టి శివకుమార్, రచయతలు గొరకల లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏనుగుల విధ్వంసం



ఏనుగులు తినివేసి పాడుచేసిన వరిచేనును చూపిస్తున్న బాధిత రైతు చంద్రభూషణ

భామిని:మండల కేంద్రానికి చెందిన రైతు పోతల చంద్రభూషణ్ నిల్వ చేసిన వరిచేను కుప్పను ఏనుగుల గుంపు మంగళవారం రాత్రి తినివేసి ధ్వంసం చేశాయి. దీంతో రెండు ఎకరాల్లోని సుమారు రూ.80వేల విలువైన వరిపంట పాడైందని బాధిత రైతు వాపోతున్నాడు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని కోరుతున్నాడు.

కన్యకాపరమేశ్వరికి వెండి సింహాసనం



వెండి సింహాసనంలో అమ్మవారిని ఆసీనులను చేసి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం టౌన్: పట్టణంలో కొలువైన కన్యకాపరమేశ్వరి అమ్మవారికి వెండి సింహాసనాన్ని ప్రముఖ వ్యాపారవేత్త కీర్తిశేషుడు నారాయణం విశ్వనాథం కుటుంబసభ్యులు బుధవారం మార్గశిర మాసం దశమి సందర్భంగా సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వెండి సింహాసనంలో ఆసీనులును చేసి వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సీఏ.నారాయణం వెంకటరమణమూర్తి, వెంకట చలమాజీ, కామేశ్వరరావు, ఈశ్వర్‌కుమార్, శేఖర్, ఏడుకొండలు, రాంజీ, అనంతపల్లి కృష్ణారావు, గణపతిరావు, పాలకమండలి సభ్యులు కుమ్మరిగుంట శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయపోటిల్లో రాణించిన గురుకుల పాఠశాల విద్యార్థి



బ్రాంజ్ మెడల్ సాధించిన నితిన్‌సాయి మనోహర్

సాలూరు: పట్టణ పరిధిలోని పీఎన్ బొడ్డవలసలో గల డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి జాతీయ స్థాయి పోటీల్లో రాణించినట్లు ప్రిన్సిపాల్ ఆశీర్వాదం బుధవారం తెలిపారు. ఈ నెల 19 నుంచి 24 వరకు జమ్ముకశ్మీర్‌లో జరిగిన జాతీయస్థాయి సబ్ జూనియర్ క్రీడాపోటీల్లో సాఫ్ట్‌బాల్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ఆడిన జట్టులో పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న నితిన్ సాయి మనోహర్ బ్రాంజ్ మెడల్ సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ విద్యాసాగర్, పీఈటీ నాయుడులు అభినందించారు.

నేడు అండర్-17 ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-17 బాల, బాలికల ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక ఈనెల 26న నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధి డీవీ చారిప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి నగర శివారుల్లో గల విజ్జీ స్టేడియంలో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో 2008 జనవరి 1 నుంచి 2011 డిసెంబర్ 21వ తేదీ మధ్య జన్మించిన క్రీడాకారులు మాత్రమే పాల్గొనేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 28, 29 తేదీల్లో కాకినాడ జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని వెల్లడించారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గురువుల వినూత్న నిరసన



ఒంటికాలిపై నిల్చొని నిరసన తెలియజేస్తున్న గురువులు

సీతంపేట: సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంపై గిరిజన గురుకులాల్లో అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేశారు. సీతంపేట ఐటీడీఏ ముఖద్వారం వద్ద ఉన్న ఆదివితల్లి విగ్రహం ముందు బుధవారం జోరువానలో ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. 36 రోజులుగా నిరసన దీక్షలు చేపట్టి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి న్యాయం చేయాలని కోరారు. డీఎస్సీలో తమ పోస్టులు మినహాయించి సీఆర్‌టీగా మార్పు చేయాలని, 2022 పీఆర్సీ ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బి.గణేష్, ఎస్.మోహన్‌రావు, కె.భవాని తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లకు గ్రహణం

- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- పార్వతీపురం, సాలూరులో 95శాతం పనుల పూర్తి
- మిగులు పనులు గాలికొదిలేసిన ప్రభుత్వం
- ప్రభుత్వం నిర్లక్ష్యంతో పేదలకు దక్కని గృహయోగం



పార్వతీపురంలో నిర్మాణం పూర్తి చేసిన టిడ్కో ఇళ్లు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సాలూరులో నిర్మాణం పూర్తి చేసిన టిడ్కో ఇళ్లు

పార్వతీపురంటౌన్: గత ప్రభుత్వం 95 శాతం నిర్మించిన టిడ్కోఇళ్లకు గ్రహణం పట్టింది. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ఇళ్ల పంపిణీ నిలిచిపోయింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపించి సకాలంలో ఇళ్ల నిర్మాణం దాదాపు పూర్తి చేశారు. టిడ్కో గృహ సముదాయాల వద్ద పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ గృహాలను అందించాలని శరవేగంగా పనులు చేపట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కనీసం వాటిని పట్టించుకునే పరిస్థితి లేదు. టిడ్కో ఇళ్లు అందక అద్దె ఇళ్లలోనే అవస్థలు పడుతున్నారు.

సొంతిల్లు లేక అద్దె ఇంటిలో ఉంటున్నాం



20 ఏళ్లుగా అద్దె ఇంటిలో ఉంటున్న నాకు టిడ్కో ఇల్లు దక్కింది. 2017వ సంవత్సరంలో సొంతిల్లు అందుతోందన్న ఆశతో అప్పు చేసి తొలివిడతలో రూ.12,500 వేలు చెల్లించాను, ఇప్పటివరకు ఇల్లు కేటాయించక పోవడంతో ఒక వైపు రుణానికి వడ్డీ, మరో వైపు అద్దె చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు.

– కె.స్వామి, లబ్ధిదారు, పార్వతీపురం

కూటమి ప్రభుత్వం చొరవ చూపడం లేదు



2017లో నాకు టిడ్కో ఇల్లు మంజూరు చేశారు. అప్పుడు రూ.500 చెల్లించాను. కేవలం శంకుస్థాపనకే పరిమితమైంది. టీడీపీ ఇళ్ల నిర్మాణం ప్రారంభించలేదు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇళ్ల పనులు ప్రారంభించి దాదాపు పూర్తి చేశారు. నా పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి 6 నెలలు గడుస్తున్నా మిగులు పనులు ప్రారంభించలేదు.

– పి. మార్కండేయులు, లబ్ధిదారు పార్వతీపురం

పేదల ఇళ్లపై వివక్ష తగదు



నూతన ప్రభుత్వం రావడంతో టిడ్కో ఇళ్ల మిగులు పనులు ప్రారంభించలేదు. గత వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పరిపాలనా కాలంలో దాదాపు పూర్తి చేశాం. లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేశాం. జిల్లాలో పార్వతీపురం, సాలూరు నియోజకవర్గాల్లో 1898 ఇళ్లు నిర్మించాం. పార్వతీపురంలో తాగునీరు, డ్రైనేజీ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. వాటిని పూర్తి చేసేందుకు గత ప్రభుత్వం రూ. 11 కోట్లు విడుదల చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం టిడ్కో ఇళ్లపై వివక్ష చూపడం సరికాదు. మిగులు పనులు పూర్తి చేసి పేదలకు అందజేయాలి

– జమ్మాన ప్రసన్నకుమార్, ఏపీ టిడ్కో మాజీ చైర్మన్

పేదల వద్ద వసూలు

పార్వతీపురం మన్యం జిల్లాలో సాలూరు, పార్వతీపురంలలో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి లబ్ధి దారులను గుర్తించి 2017లో వారి వాటాగా రూ.500 కేటగిరిలో 300 చదరపు అడుగులు, రూ.25000 కేటగిరిలో 365 చదరపు అడుగులు, రూ.50వేల కేటగిరిలో 430 చదరపు అడుగుల్లో ఇళ్ల నిర్మాణానికి నిర్ణయించారు. ఈ మేరకు లబ్ధిదారుల నుంచి పార్వతీపురంలో రూ.1.75 కోట్లు, సాలూరులో రూ.1.08 కోట్లు వసూలు చేశారు. పేదల నుంచి డబ్బులు వసూలు చేసిన టీడీపీ ప్రభుత్వం కనీసం పనులు ప్రారంభించలేదు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒక్క రూపాయికే

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒక్క రూపాయికే పేదలకు ఇల్లు అందించేందుకు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా సాలూరు మున్సిపాలిటీ పరిధిలో 1100, పార్వతీపురం మున్సిపాలిటీ పరిధిలో 798 టిడ్కో ఇళ్ల పంపిణీకి చర్యలు చేపట్టారు. ఐదేళ్ల కాలంలో శరవేగంగా పనులు చేపట్టి 95 శాతం పూర్తి చేశారు. మిగులు పనులు పూర్తి చేసేందుకు ఎన్నికల ముందు రూ.11 కోట్లు మంజూరు చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా పనులు నిలిపివేశారు. గృహ సముదాయాల వద్ద పూర్తిస్థాయిలో మౌలిక వసతులు, ఆహ్లాద వాతావరణం కల్పించేందుకు పార్కులు, తాగునీటి సౌకర్యం పూర్తిస్థాయిలో కల్పించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు టిడ్కో గృహాల ఊసెత్తడం లేదు.

పేదోడి సొంతింటి కల సాకారంలో
రాజన్నదొర ముద్ర



గతం ప్రభుత్వం హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న పీడిక రాజన్నదొర (ఫైల్)

సాలూరు: గ్రామాలతో పోలిస్తే పట్టణాల్లో సొంత ఇల్లు అంటే పేద, మధ్య తరగతి కుటుంబాలకు చాలా కష్టమైన పనే. అటువంటి పేదవాడి సొంతింటి కలను సాలూరు పట్టణంలో సాకారం చేసిన అంశంలో మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర చెరగని ముద్ర వేసుకున్నారు. ఓ వైపు టిడ్కో ఇళ్లతో పాటు మరోవైపు నెలిపర్తి , గుమడాం తదితర ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు మంజూరుచేయించి పేదవానికి సొంత గూడుకు తనవంతు ప్రయత్నాన్ని రాజన్నదొర చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నాటి ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర కృషితో ఇళ్లతో పాటు పూర్తి మౌలిక వసతుల కల్పనతో పట్టణంలోని గుమడాం సమీపంలో టిడ్కో ఇళ్ల గృహప్రవేశాలు అంగరంగ వైభవంగా జరిగాయి.

జూనియర్స్ కబడ్డీలో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు





జూనియర్స్ కబడ్డీ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన జిల్లా బాల, బాలికల జట్లు

- ద్వితీయస్థానం సాధించిన బాల, బాలికల జట్లు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన కబడ్డీ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జరిగిన 50వ అంతర్ జిల్లాల జూనియర్స్ కబడ్డీ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన బాల, బాలికల జట్లు ఉత్తమ ప్రతిభ కనబరిచాయి. మూడు రోజుల పాటు జరిగిన పోటీల్లో ఇరు జట్లు ద్వితీయ స్థానాలు దక్కించుకుని విజయనగరం జిల్లా కీర్తి ప్రతిష్టలను చాటి చెప్పాయి.

రాష్ట్రస్థాయి పోటీల్లో అద్భుత క్రీడా ప్రతిభతో రాణించి విజేతలుగా నిలిచిన క్రీడాకారులను జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ఐవీపీ రాజు, అధ్యక్షుడు రంగారావుదొర, కార్యదర్శి కేవీ.ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిపేన లక్ష్మణరావు, కోశాధికారి శివకుమార్‌లు అభినందించారు.

సర్వమానవాళికి యేసే లోకరక్షకుడు

- ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు ప్రేమానందం



ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్న ఎఐసిసి జిల్లా అధ్యక్షుడు ప్రేమానందం, తదితరులు

విజయనగరం టౌన్: సర్వమానవాళికి యేసే లోకరక్షకుడని ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పి.ప్రేమానందం తెలిపారు. ఈ మేరకు స్థానిక వీటీ అగ్రహారంలో ఉన్న న్యూ టెస్టిమెంట్ చర్చి ఆవరణలో క్రిస్మస్ వేడుకలను బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తుప్రేమను ప్రతి ఒక్కరూ పొందాలన్నారు. మన పాపాల నుంచి విముక్తి కల్పించి శాంతిమార్గంలో నడిపించే దేవుడని కొనియాడారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రెవరెండ్ నికొడెమస్ మాట్లాడుతూ దేవుని సువార్తను విశ్వజనీనం చేయాలన్నారు. అనంతరం 36వ డివిజన్ కార్పొరేటర్ బాలి పద్మావతి కేక్ కట్ చేశారు. 47వ వార్డు కార్పొరేటర్ పట్నాన పైడిరాజు క్యాండిల్స్ వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించారు. రెవరెండ్ సుకుమార్ చౌదరి అద్భుతమైన సాక్ష్యాన్ని, దైవసందేశాన్ని అందించారు. ఎన్‌టీసీ చర్చి క్వయర్ టీమ్ ఆలపించిన క్రీస్తు గీతాలాపన ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. ఏంజెల్, చార్లెస్ డాని ప్రేమ్సన్, టి.సారమ్మ, జామి అప్పలనాయుడు, కోరాడ శ్రీరాములు, బి.సంతోష్, బి.రాంబాబు, ఎస్.లక్ష్మి, ఎస్.కాంతారావు, ఎస్.హరీష్, డి.కృష్ణ, జి.శామ్యూల్, ఎన్.ప్రభుకుమార్, అధిక సంఖ్యలో క్రైస్తవులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మక్కువకు ప్రయాణం సాహసమే

- గుండెల్లో గుబులు రేపుతున్న బాగువలన మీదుగా ప్రయాణం
- అధ్వానంగా తయారైన రోడ్డు



సాలూరు-మక్కువ రోడ్డు మధ్యలో గోతుల్లో చేరిన వర్షపు నీరు

సాలూరు: సాలూరు నుంచి బాగువలస మీదుగా మక్కువకు ప్రయాణమంటే ప్రజల గుండెల్లో గుబులు రేగుతుంది. గోతులు, గుంతలతో ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే నరకయాతనగా మారింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మార్గం గుండా ప్రయాణమంటే సాహసమేనని ప్రజలు భావిస్తున్న పరిస్థితి ఏర్పడింది. పెద్దపెద్ద గుంతల్లో దిగిపోయి లారీల వంటి పెద్ద వాహనాలు పాడైపోతుండగా, ద్విచక్రవాహనాలు పొరపాటున ఈ గుంతల్లో దిగుతూ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఈ గోతుల్లో వర్షపునీరు నిండిపోవడంతో గుంతల లోతు అంచనా వేయలేక పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

మక్కువ రోడ్డుకు మోక్షమెప్పుడో ?

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ప్రత్యేక కృషితో సాలూరు నుంచి మక్కువ వరకు 19.60 కి.మీ రోడ్డు వెడల్పు, పటిష్ట పరిచేందుకు సుమారు రూ.55 కోట్ల 56 లక్షల అంచనా విలువతో ఈ రోడ్డు మంజూరైంది. రూ.38 కోట్ల 52 లక్షల పని విలువతో ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో 2021 మార్చి 1వ తేదీన ఈ రోడ్డు పనులు ప్రారంభించారు. పనుల్లో భాగంగా 6 కి.మీ మెటల్ లేయర్ వేశారు. 32 కల్వర్టులకు గాను 16 కల్వర్టులు, 8 మైనర్ బ్రిడ్జిలకు గాను 3 బ్రిడ్జిల నిర్మాణం పూర్తయింది. మిగిలిన పనులు చేపట్టాల్సి ఉంది.



గజానికో గొయ్యితో దర్శనమిస్తున్న రోడ్డు

రోడ్డు నిర్మాణం పూర్తిచేయరా?

ఇకనైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి ఈ రోడ్డునిర్మాణం పూర్తి చేయించి తమ రహదారి కష్టాలు తీర్చాలని సాలూరు,మక్కువ మండలాల ప్రజలు కోరుతున్నారు.ఇటీవల ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈ మార్గం గుండా కాకుండా సాలూరు నుంచి మామిడిపల్లి, శంబర మీదుగా మక్కువకు ప్రయాణించిన విషయం పాఠకులకు విదితమే.

ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు జిల్లా క్రీడాకారులు



ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు అర్హత సాధించిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న ఆలిండియా యూనివర్సిటీ పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారులు అర్హత సాధించారు. ఇటీవల విశాఖలోని ఆంధ్రాయూనివర్సిటీలో జరిగిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నలుగురు క్రీడాకారులు ఈనెల 26 నుంచి ఒడిశా రాష్ట్రంలో జరగబోయే ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యారు. విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన పి.వసంత 100, 200 మీటర్ల పరుగు పోటీలో అర్హత సాధించగా..సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న ఎం.హరీష్ 5000 మీటర్లు, 10000 మీటర్ల పరుగు పోటీలో, విజయనగరం ఎంఆర్ కళాశాలలో చదువుతున్న ఎస్.శ్రావణి 200మీటర్లు, 400 మీటర్ల పరుగు పోటీలో, శ్రీనివాస కళాశాలలో చదువుతున్న వి.భార్గవి 100 మీటర్ల పరుగు పోటీలో అర్హత సాధించినట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధి లీలాకృష్ణ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు బుధవారం పయనం కాగా..వారిని అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు. ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పతకాలు సాధించి విజయనగరం ఖ్యాతిని చాటి చెప్పాలని ప్రోత్సహించారు.

నారాయణ..నారాయణ..!

- ఉనికి కోల్పోతున్న ఆనకట్ట
- ఊడిపోయిన తలుపులు
- శిథిలావస్థకు చేరిన సాగునీటి వనరు



షట్టర్లు నిలిపేందుకు అడ్డంగా పెట్టిన రాయి



నారాయణపురం ఆనకట్ట

సంతకవిటి: మండలంలో 18,807 ఎకరాల్లో వ్యవసాయానికి ఆధారంగా ఉన్న ప్రధానమైన సాగునీటి వనరు నారాయణపురం ఆనకట్ట. దశాబ్దాల క్రితం నిర్మించిన ఆనకట్ట ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. ఆనకట్ట కుడి, ఎడమ ప్రధాన కాలువలు ద్వారా కొన్ని వేల ఆయకట్టు ఉంది. నారాయణపురం ఆనకట్టలో షట్టర్ల వ్యవస్థ కీలకం. మొత్తం 118 షట్టర్లు ఉండగా వాటిలో అధికశాతం షట్టర్లు పాడైపోవడంతో రాళ్లను ఆధారంగా పెట్టి తలుపులు నిలబెట్టారు. దీంతో ఆనకట్టలో నీరు నిలవడం గగనంగా ఉంది. కొన్ని షట్టర్లు పూర్తిగా లేకపోవడం కొసమెరుపు. 50.50 కిలోమీటర్ల పొడవున్న కుడి ప్రధాన కాలువ ద్వారా సంతకవిటి, పొందూరు, ఎచ్చెర్ల మండలాలకు సాగునీరు అందాల్సి ఉండగా ఆనకట్టలో పూర్తిస్థాయిలో నీరు నిలవక పోవడం, కాలువల పరిస్థితి బాగా లేక పోవడంతో శివారు ఆయకట్టు రైతులకు పూర్తిస్థాయిలో నీరు అందడం మృగ్యంగా ఉంది. దీంతో ప్రతి ఏటా పంటను కోల్పోవలసి వస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

గట్టు కొట్టేసే ప్రమాదం ఉన్నా..

సంతకవిటి మండలంలోని రంగారాయపురం, వాసుదేవపట్నం గ్రామాల మధ్య ఆనకట్టకు కూతవేటు దూరంలో కాలువకు గండి పడే ప్రమాదం ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులే స్వయంగా ఇసుక బస్తాలతో కొంతమేర గట్టును పటిష్ట పరుచుకుని వారి పంటలను కాపాడుకున్నారు.

జైకా నిధులు మంజూరైనా..సాగని పనులు

నారాయణపురం ఆనకట్ట ఆధునీకీకరణకు రూ.112.10 కోట్లు మంజూరైనా ఇప్పటి వరకు 25శాతం పనులు మాత్రమే చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ మొత్తం నిధుల్లో దాదాపు రూ.2.5 కోట్లు షట్టర్లు మార్చడానికి, ఆనకట్టలో కాంక్రీట్ పనులకు మంజూరవగా ఇప్పటివరకు కనీసం పని జరగక పోవడం విశేషం. 118 షట్టర్ల స్థానంలో 108 షట్టర్లు ఏర్పాటు కావాల్సి ఉంది. కొంతమేర కాలువలో లైనింగ్ పనులు మాత్రమే చేపట్టినట్లు అధికారులు తెలిపారు.



పాడైపోయిన కుడి ప్రధాన కాలువలోకి నీటిని మలిచే రెగ్యులేటర్



రైతులు ఇసుక బస్తాలతో గట్టును కప్పిన ప్రదేశం

నోటీసులు ఇందించాం

జైకా నిధుల ద్వారా పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్‌కు నోటీసులు పంపించాం. పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటాం.

–బి.రాంబాబు, ఏఈఈ, కుడి ప్రధాన కాలువ

నిరంతర పర్యవేక్షణ



సిబ్బందికి సూచనలు చేస్తున్న విజయనగరం డిప్యూటీ సీఎంఈ, పార్వతీపురం మన్యం జిల్లా డీపీటీఓ శ్రీనివాసరావు

పాలకొండ రూరల్: ఆర్టీసీ సంస్థ ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేలా నింతర పర్యవేక్షణ చేపడుతున్నామని విజయనగరం డిప్యూటీ సీఎంఈ, పార్వతీపురం మన్యం జిల్లా డీపీటీఓ కొట్నాన శ్రీనివాసరావు అన్నారు. షెడ్యూల్ – 3 పరిధిలో గల పాలకొండ – బూర్జ రహదారిలో బస్సు సర్వీసులపై బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రస్తుత సీజన్‌లో మంచుతో పాటు వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్నందున ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యం కల్పించాలని డ్రైవర్లకు సూచించారు. డిపో నుంచి బస్సు బయలుదేరే ముందే చెక్ చేసుకోవాలని తెలిపారు. ఈయన వెంట పాలకొండ డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు, మెకానికల్ ఏఈ బీవీఎంకే.రాజు, టైర్స్ ఏడీసీ భాసూరు కృష్ణమూర్తి, తదితరులున్నారు.